క్లుప్తంగా

నిత్యాన్నదానానికి విరాళం



నిత్యాన్నదానానికి విరాళం అందజేస్తున్న దాత కుసుమకుమారి

ఐ.పోలవరం: మురమళ్లలోని భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి కాకినాడకు చెందిన సాగిరాజు కుసుమ కుమారి రూ.10 వేల విరాళాన్ని సమర్పించారు. దీనిని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలకు శుక్రవారం అందజేశారు. దాతకు స్వామివారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం ఇచ్చారు. ఇదిలా ఉంటే శివరాత్రి ఏర్పాట్లపై అమలాపురం ఆర్డీఓ వసంత రాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. దర్శనానికి వచ్చే భక్తులకు ఏర్పాట్లు, ఉచిత, వీఐపీ దర్శనాలు తదితర అంశాలపై అడిగి తెలుసుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలన్నారు. చివరి రోజు జరిగే తెప్పోత్సవ ఏర్పాట్లపై ఆరా తీశారు.

వైఎస్సార్ సీపీలో చేరిక



మంత్రి విశ్వరూప్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న సత్తిబాబు

అల్లవరం: గోడితిప్ప గ్రామానికి చెందిన జనసేన నాయకుడు మేడిద సత్తిబాబు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ సమక్షంలో శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. అమలాపురంలోని మంత్రి కార్యాలయంలో సత్తిబాబుకు పార్టీ కండువా వేసి ఆహ్వానించారు. పార్టీ విజయానికి కృషి చేయాలని మంత్రి విశ్వరూప్ తెలిపారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ తుట్టిపు బాబి, నాయకుడు దేవరపల్లి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

సాగు నీరందించండి

తాళ్లరేవు: మండలంలో శివారు భూములకు సాగునీరందించాలని కోరుతూ శుక్రవారం ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో రైతులు చొల్లంగి జాతీయ రహదారి 216లో రాస్తారోకో చేశారు. సంఘ జిల్లా కార్యదర్శి వల్లు రాజబాబు మాట్లాడుతూ కాలువ ఆధునికీకరణ పనుల్లో లోపాల వల్లే నీరు రావడం లేదని ఆరోపించారు. ఈ సందర్భంగా ఇరిగేషన్ అధికారులు, రైతులకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. రైతులు కట్టా త్రిమూర్తులు, ఈతకోట రాఘవ, శ్రీపాదం సత్యనారాయణ, స్వర్ణ రాజు తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ ఉండాలి



లైసెన్స్ తనిఖీ చేస్తున్న ఆర్ఏఓ మునిస్వామి

యానాం: యానాం మున్సిపాలిటీ పరిధిలో వివిధ వ్యాపారాలు చేస్తున్న వారు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలని ఆర్ఏఓ మునిస్వామి స్పష్టం చేశారు. శుక్రవారం పట్టణ పరిధిలోని వెంకన్న కాంప్లెక్స్‌లో పలు వ్యాపార సంస్థలను పరిశీలించి ఆయా యజమానులతో మాట్లాడి ట్రేడ్ లైసెన్స్‌లను తనిఖీ చేశారు. అంతకు ముందు మున్సిపల్ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బంది సంతకాల రిజిష్టర్, వివిధ రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

తపాలా పథకాలపై వడ్డీ రేట్ల పెంపు

అమలాపురం టౌన్: తపాలా పొదుపు పథకాలపై వడ్డీ రేట్లు పెరిగాయని అమలాపురం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్ సలాది శ్రీధర్ శుక్రవారం తెలిపారు. పోస్టల్ మంత్లీ ఇన్‌కం స్కీముపై ప్రస్తుతం ఉన్న 6.70 శాతం వడ్డీ 7.1 శాతానికి పెరిగిందన్నారు. పోస్టాఫీస్ వార్షిక డిపాజిట్‌పై వడ్డీని 5.5 శాతం నుంచి 6.6 శాతానికి, రెండేళ్ల డిపాజిట్‌పై 5.7 నుంచి 6.8 శాతానికి, మూడేళ్ల డిపాజిట్‌పై 5.8 నుంచి 6.9 శాతానికి, ఐదేళ్ల డిపాజిట్‌పై 6.7 నుంచి 7 శాతానికి వడ్డీ పెంచారని వివరించారు.

రామలింగేశ్వరస్వామి కల్యాణం

అల్లవరం: ఎస్.రామేశ్వరంలో కొలువైన పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి వారి కల్యాణాన్ని పురోహితుడు పుల్లేటికుర్తి గౌరి శంకరశాస్త్రి ఆధ్వర్యంలో వేద పండితులు వైభవంగా నిర్వహించారు. దేవదాయ ధర్మదాయ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ అంగాని రామారావు హాజరయ్యారు.

బాలికకు పరామర్శ

కాట్రేనికోన: చిర్రయానంలో సామూహిక అత్యాచారానికి గురైన బాలికను ముమ్మిడివరం ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం కాట్రేనికోన తహసీల్దార్ బి.మృత్యుంజయరావు, ఎంపీడీఓ కామేశ్వరరావు పరామర్శించారు. బాధితురాలి నుంచి సేకరించిన సమాచారాన్ని ఉన్నతాధికారులకు నివేదించారు.

పాహిమాం... పరమ శివా

- నేడు శివరాత్రి ప్రత్యేక పూజలు
- ఆలయాల్లో ఏర్పాట్లు పూర్తి



ముమ్మిడివరంలో ఉమాసూరేశ్వరస్వామి



అమలాపురం సిద్ధేశ్వరస్వామి ఆలయం వద్ద లైటింగ్



మురమళ్లలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి



గొల్లవిల్లిలో భీమేశ్వరుని కల్యాణ వేడుక



భీమేశ్వరుని ఆలయంలో స్వామివారి కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

అమలాపురం టౌన్: శివరాత్రి ఉత్సవాలకు అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని శివాలయాలు ముస్తాబయ్యాయి.. శనివారం ఈ ఉత్సవాలను వైభవంగా నిర్వహించనున్నారు. ఆలయాల వద్ద భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేశారు. శివాలయాలను వివిధ పుష్పాలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. విద్యుత్ దీపాలతో శివుని ఆకారంలో ఉన్న సెట్టింగులు ఆకట్టుకుంటున్నాయి. అమలాపురంలో పురాతన చెన్న మల్లేశ్వరస్వామి ఆలయంతో పాటు సిద్ధేశ్వరస్వామి, చంద్రమౌళీశ్వరస్వామి, రామలింగేశ్వరస్వామి, నాగ లింగేశ్వరస్వామి ఆలయాల్లో శివరాత్రి ఉత్సవాలకు ఏర్పాట్లు చేశారు. ఉదయం నుంచి భక్తుల రద్దీ అధికంగా ఉండే అవకాశం ఉండడంతో ఆయా కమిటీలు తగిన ఏర్పాట్లు చేశాయి. చెన్న మల్లేశ్వరస్వామి ఆలయం వద్ద ఆలయ చైర్మన్ కల్వకొలను బాబి, ఈఓ సత్యనారాయణమూర్తి ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరిగాయి. ఈ ఆలయానికి కలెక్టర్ హిమాన్షు శుక్లా వచ్చి పూజలు ఆచరించనున్నారు. స్థానిక మెయిన్ రోడ్డు చెంతన సిద్ధేశ్వరస్వామి ఆలయానికి వేల సంఖ్యలో భక్తులు రానున్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా పట్టణ సీఐ ఎస్‌సీహెచ్ కొండలరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. స్థానిక గురిగంటు చెరువు వద్ద ఓం శాంతి కేంద్రంచే నిర్మించిన నూతన భవన ప్రాంగణంలో పుష్ప లింగాన్ని ప్రదర్శనగా ఉంచనున్నారు. స్థానిక సర్ సీవీ రామన్ స్కూల్ ప్రాంగణంలో ఓంశాంతి కేంద్రం ఆధ్వర్యంలో కేంద్రం ఇన్‌చార్జి బీకే శ్రీదేవి విద్యార్థులకు శివరాత్రి విశిష్టతను వివరించారు. స్కూల్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన శివ లింగానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూజలు చేశారు. స్కూల్ డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఉమాసూరేశ్వర స్వామి ఆలయం ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతోంది. అయినాపురంలోని ఉమాసోమేశ్వరస్వామి, అన్నంపల్లి పార్వతీ గౌతమేశ్వరస్వామి, కొమానపల్లి చోడేశ్వర లోకేశ్వరస్వామి, కొత్తలంక ఉమాభోగేశ్వరస్వామి తదితర ఆలయాల్లో మహా శివరాత్రిని వైభవంగా నిర్వహించనున్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీలు అన్ని ఏర్పాట్లు చేశాయి.

హరహరా... వీరేశ్వరా

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయం శివరాత్రి ఉత్సవాలకు సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. పెళ్లికాని వారు ఇక్కడ కల్యాణం చేయించుకుంటే వివాహం జరుగుతుందని ప్రసిద్ధి. నిత్యం ఇక్కడ 116 కల్యాణాలు జరుగుతున్నాయి. ఆలయంలో శివరాత్రి ఉత్సవాలను ఈ నెల 18 నుంచి 22 వరకూ నిర్వహించనున్నారు. శనివారం తెల్లవారు జామున 4 గంటల నుంచి స్వామివారి దర్శనాలు, పంచామృత అభిషేకాలు, కుంకుమ పూజలు జరుగుతాయి. అలాగే ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 4 గంటల వరకూ ద్వాదశ పుష్కర నదీ జలాలతో అభిషేకాలు ఉంటాయి. సాయంత్రం 5 గంటలకు శూలాల సంబరం, బాణసంచా కాల్పులు, నాదస్వర బృందాలతో ధూపసేవ అనంతరం నందాదీపం ప్రజ్వలన జరుగుతుంది. రాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలదర్శనం అనంతరం స్వామి, అమ్మవారికి మహా నివేదన ఉంటుంది. మిగతా రోజులలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, అమ్మవారికి కుంకుమ పూజలతో పాటు రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగనున్నాయి. చివరి రోజున వృద్ధ గౌతమీ గోదావరిలో హంస వాహనంపై భద్రకాళీ సమేత వీరేశ్వరుని తెప్పోత్సవం ఉంటుంది. భక్తులకు అసౌకర్యం కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ తెలిపారు.

ఉప్పలగుప్తం: శివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని గొల్లవిల్లి గ్రామంలో మాణిక్యాంబ సమేత భీమేశ్వర స్వామివారికి శుక్రవారం కల్యాణోత్సవం జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నుంచి సత్యవాడ గోపాలకృష్ణ కుటుంబీకులచే స్వామివారి వార్షిక దివ్య కల్యాణం సంప్రదాయబద్ధంగా జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని వేడుకను తిలకించారు. స్వామివారిని దర్శించుకున్నారు.

మౌలిక సదుపాయాల పరిశీలన

అమలాపురం టౌన్: బోడసకుర్రులోని టిడ్కో ఇళ్ల సముదాయంలో మౌలిక సదుపాయాలను మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులకు తాగునీరు, విద్యుత్ తదితర సౌకర్యాలు ఎలా అందుతున్నాయో ఆరా తీశారు. ప్రతి ప్లాట్‌కు వెళ్లి ఇప్పటికే సమకూర్చిన సౌకర్యాల పట్ల సంతృప్తిగా ఉన్నారా.. ఇంకా ఎలాంటి సదుపాయాలు కావాలనే అంశాలపై వారితో మాట్లాడారు. టిడ్కో ఇళ్లలో కొందరు గృహ ప్రవేశాలు చేసుకుంటున్న వారితో మాట్లాడారు. పారిశుధ్యంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. రోజూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని వారు సూచించారు. అనంతరం టిడ్కో ఇళ్ల సముదాయం పక్కనే నిర్మిస్తున్న జగనన్న కాలనీలో ఇళ్ల పనులను చైర్‌పర్సన్, కమిషనర్‌తో పాటు మున్సిపల్ డీఈఈ కొత్త అప్పలరాజు, ఇతర అధికారులు పరిశీలించారు.



జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ సత్య నాగేంద్రమణి, కమిషనర్ నాయుడు

కళేబరాల తొలగింపునకు చర్యలు

సాక్షి ఇంపాక్ట్

ఉప్పలగుప్తం: మండలంలోని అమలాపురం, చల్లపల్లి ప్రధాన పంట కాలువలో కొన్ని రోజులుగా వస్తున్న జంతు కళేబరాలను తొలగించారు. దీనిపై ఈ నెల 6న 'సాక్షి' దినపత్రికలో పంట కాలువలో జంతు కళేబరాలు అనే శీర్షికన వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. డీఎల్‌పీవో జి.మల్లికార్జునరావు ఆధ్వర్యంలో ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి శుక్రవారం సిబ్బందితో ప్రత్యేక చర్యలు చేపట్టారు. కొన్ని రోజులుగా అంతుచిక్కని వైరస్‌తో పందులు మృత్యువాత పడుతున్నాయి. పెంపకందారులు చనిపోయిన పందులను పంట కాలువలో పడేస్తున్నారు. ముఖ్యంగా ఈ సమస్య అమలాపురం నుంచి చల్లపల్లి ప్రవహించే ప్రధాన పంట కాలువలో ఉంది. కళేబరాలను తొలగించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



చల్లపల్లి కాలువలో జంతు కళేబరాల తొలగింపు పనులను పరిశీలిస్తున్న అధికారులు

అసిస్టెంట్ పోస్టుల భర్తీకి చర్యలు

యానాం: యానాం, పుదుచ్చేరి, మాహే, కారైకల్ తదితర ప్రాంతాల్లోని వివిధ ప్రభుత్వ శాఖల్లో ఉన్న అసిస్టెంట్ పోస్టులను రాత పరీక్ష ఆధారంగా భర్తీ చేయాలని శుక్రవారం ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో దానికి సంబంధించిన అర్హత, నిబంధనలతో కూడిన నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. ప్రస్తుతం యూడీసీలుగా పనిచేస్తున్న ఉద్యోగులంతా ప్రమోషన్ల ద్వారా అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయాలని ఉద్యమాలు చేస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. మొత్తం 324 అసిస్టెంట్ పోస్టులను డిపార్ట్‌మెంటల్ కాంపిటేటివ్ పరీక్ష ద్వారా భర్తీ చేస్తామని, సబార్డినేట్ ఆఫీసర్స్‌కు అకౌంట్ టెస్ట్, మినిస్టీరియల్ స్టాఫ్‌కు కామన్ జనరల్ డిపార్ట్‌మెంటల్ టెస్ట్ నిర్వహించనున్నట్లు ప్రభుత్వ కార్యదర్శి జయశంకర్ పేర్కొన్నారు.

శైవక్షేత్ర యాత్రకు స్వయం సేవకులు

యానాం: తెలంగాణ రాజన్న జిల్లాలోని చారిత్రక విశిష్టత కలిగిన వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి శైవక్షేత్రానికి మహా శివరాత్రిని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సభ్యులు తరలివెళ్లారు. సుమారు 25 మంది సేవకులు వేములవాడకు ప్రత్యేక బస్సులో బయలుదేరారు.

సర్కార్ ఎక్స్‌ప్రెస్‌ను పొడిగించాలి

యానాం: యానాం వాసులకు ఉపయోగకరంగా ఉండే విధంగా కాకినాడ– చెన్నై సర్కార్ ఎక్స్‌ప్రెస్ రైలును పుదుచ్చేరి వరకూ పొడిగించాలని పుదుచ్చేరి ఎంపీ వైద్యలింగం కోరారు. నూతన ట్రైన్‌ల కోసం శుక్రవారం తిరుచిలో జరిగిన దక్షిణ భారత రైల్వే సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం సర్కార్ ఎక్స్‌ప్రెస్ చెంగల్‌పట్టు వరకూ వెళుతుందన్నారు. అక్కడి నుంచి కేవలం 100 కిలోమీటర్ల దూరం పుదుచ్చేరి ఉందని రైల్వే అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ఇబ్బందులు తీర్చాలని వినతి

యానాం: యానాం నియోజకవర్గంలోని గ్రామీణ ప్రాంతాల్లో కమ్యూన్ పంచాయతీలను ఏర్పాటు చేయాలని కోరుతూ పుదుచ్చేరి ప్రధాన కార్యదర్శి, కేంద్ర హోం శాఖ కార్యదర్శికి వినతిపత్రం పంపినట్లు దరియాలతిప్ప గ్రామ పెద్ద సబ్బతి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గం మొత్తాన్ని అర్బన్ ప్రాంతంగా చేయడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ముఖ్యంగా గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు కావడం లేదని, దీనివల్ల గ్రామాల్లో పేదలు పనులు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రికెట్ టోర్నీ ప్రారంభోత్సవంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ సూర్యప్రకాష్ తదితరులు

యానాం: దరియాలతిప్ప గ్రామంలో జైభీమ్ వెయిట్ టెన్నిస్ నాకౌట్ క్రికెట్ టోర్నమెంట్‌ను శుక్రవారం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పెండెం సూర్యప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దరియాలతిప్పలో క్రీడారంగ అభివృద్ధికి ప్రత్యేకంగా స్పోర్ట్స్ గ్రౌండ్ నిర్మించాల్సిన ఆవశ్యకత ఉందని, దీనిపై అధికారులతో మాట్లాడతానన్నారు. క్రీడలు మానసికోల్లాసంతో పాటు గ్రామాల్లో స్నేహపూరిత వాతావరణాన్ని కలిగిస్తాయన్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ టోర్నీలో 33 జట్లు పాల్గొంటాయని నిర్వాహకులు తెలిపారు. మొదటి మ్యాచ్ దరియాలతిప్ప, కనకాలపేట అగ్ని ఎలెవెన్ జట్ల మధ్య జరిగింది. జైభీమ్ టోర్నీ ఆర్గనైజర్ కర్నేడి నవీన్, సురేష్, యంటపల్లి శ్రీను, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అలరించిన విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలు

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో రెండురోజుల పాటు జరిగిన జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలు అలరించాయి. శుక్రవారం జరిగిన కార్యక్రమానికి జాయింట్ కలెక్టర్ ధ్యాన్‌చంద్, జెడ్పీ సీఈఓ సత్యనారాయణలు ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పర్యావరణం, ఆరోగ్యం, పరిశుభ్రత, సాఫ్ట్‌వేర్ ఆండ్రాయిడ్ యాప్‌లు, వాతావరణ మార్పులు, గణితభావన నమూనాలతో విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్‌తో తయారు చేసిన పెన్నును ఆసక్తిగా పరిశీలించి అదే పెన్నుతో ఆలమూరు మండలం సందిపూడి జెడ్పీ హైస్కూల్ విద్యార్థి పెయ్యల చంద్రలేఖకు జేసీ ఆటోగ్రాఫ్ ఇచ్చారు. అనంతరం ఆ పెన్నును జేసీకి విద్యార్థి గిఫ్ట్‌గా ఇచ్చింది. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు కార్పొరేట్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శనను తిలకించి వాటి వివరాలను సేకరించారు. విద్యార్థులకు డీఈఓ ఎం.కమలకుమారి ఆధ్వర్యంలో సైన్స్, గణితంపై క్విజ్ పోటీలను నిర్వహించారు.



ఎకో ఫ్రెండ్లీ మెటీరియల్ పెన్నుతో విద్యార్థులకు ఆటోగ్రాఫ్ ఇస్తున్న జేసీ ధ్యాన్‌చంద్

అలానే వదిలేశారు..



ఎస్.యానంలో పైపులైన్ వాల్వు గుంతలో ఆటలాడుతున్న విద్యార్థి

ఉప్పలగుప్తం: అటుగా వెళ్లే సమయంలో ఏమాత్రం అజాగ్రత్తగా ఉన్నా అంతే సంగతులు.. ఎస్.యానం పంచాయతీ పరిధి చీకట్లవారి సెంటర్ నుంచి ఎస్.కొత్తపల్లికి వెళ్లే రహదారి కూడలిలో వాటర్ పైపులైన్ వాల్వు గుంత ప్రమాదకరంగా మారింది. ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కొంత కాలం కిందట పైపులైన్ వాల్వు బిగించడానికి గొయ్యి తవ్వి పని పూర్తయ్యాక దానిపై ఎటువంటి రక్షణ చర్యలు చేపట్టకుండా వదిలేశారు. దీనివల్ల ఇటుగా ప్రయాణించే వాహనచోదకులు రాత్రి సమయాల్లో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇదిలా ఉంటే విద్యార్థులు పాఠశాల నుంచి వచ్చే క్రమంలో ఈ గోతిలో దిగి ఆటలాడుతున్నారు. అధికారులు స్పందించి అక్కడ రక్షణ ఏర్పాట్లు చేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

పర్యాటక ప్రాంతం... ప్రగతి నామమాత్రం

- కనీస వసతులు కరవు
- వెనుతిరుగుతున్న పర్యాటకులు

యానాం: రూ.కోట్ల కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధులతో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో గిరియాంపేటలో నిర్మించిన యానాం ఒబ్లిస్క్ టవర్ నిర్వహణ గాలికి వదిలేశారు. ఈఫిల్ టవర్ నమూనాతో ఈ కట్టడం నిర్మించారు. అక్కడ 2015లో ప్రారంభించిన పనులు ఇంకా పూర్తికాక పర్యాటకులు నిరాశతో వెనుతిరుగుతున్నారు. రిలయన్స్, పర్యాటక శాఖ నిధులు వాటా రూ.17.21 కోట్లతో సుమారు 18 ఎకరాల్లో ఈ నిర్మాణం చేపట్టారు. ప్రధానమైన ఒబ్లిస్క్ టవర్ 9,125 టన్నుల బరువుతో 333 (101.6మీటర్లు) అడుగుల ఎత్తులో నిర్మాణం పూర్తయ్యింది. కానీ అక్కడ పర్యాటకులకు మౌలిక సదుపాయాలు మాత్రం కల్పించడం లేదు. ఈ టవర్ యానాం పట్టణానికి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇంత దూరం వెళ్లిన పర్యాటకులకు అక్కడ తాగడానికి మంచినీరు కూడా ఉండదు. ఒబ్లిస్క్ టవర్ చుట్టూ సుమారు 17 ఎకరాలను పర్యాటకంగా అభివృద్ధి చేయాల్సి ఉంది. ఇప్పటివరకూ ఎదురుగా ముళ్లకంపలు తప్పించి ఎటువంటి నిర్మాణాలు చేపట్టలేదని అంటున్నారు. గత ఏడాది టవర్ ఎదురుగా వాటర్ ఫౌంటైన్ల పనులు చేపట్టారు. ఆ పనులు సైతం అసంపూర్తిగా నిలిచిపోయాయి. విద్యుత్ లైట్లు వేసి వాటిని పట్టించుకోకపోవడంతో పాడైపోతున్నాయి. ఇటీవల చిన్నపాటి సిమెంట్ హట్‌లను ఏర్పాటు చేశారు. అవికాస్తా ముళ్ల పొదల్లో నిర్మించడంతో అక్కడ కూర్చోడానికి పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు.

నీడలేదు.. బెంచీలు లేవు

టవర్ పైభాగానికి సుమారు వంద మీటర్ల ఎత్తుకు వెళ్లడానికి లిఫ్ట్‌ను ఏర్పాటు చేశారు. గత ఏడాది నుంచి లిఫ్ట్ పనిచేయడం లేదు. సంబంధిత పర్యాటక శాఖ అధికారులు లిఫ్ట్‌కు మరమ్మతులు చేయించడం లేదు. దీంతో మెట్లు ఎక్కి, దిగలేక పర్యాటకులు ఇబ్బందులు పడుతున్నారు. పర్యాటకులు సేద తీరేందుకు కనీసం సిమెంటు బెంచీలు వేయించాలని కోరుతున్నారు. టాయ్‌లెట్స్ నిర్మాణం జరిగినా అవి ముళ్ల పొదల్లో ఉన్నాయి. టవర్ మెయింటినెన్స్ లేక పైభాగంలో ఇనుప ఊచలు తుప్పుపడుతున్నాయి. ఎంట్రీ ఫీజు కట్టి లోపలకు వెళుతున్నప్పటికీ సదుపాయాలు లేవని పర్యాటకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



గిరియాంపేటలో ఒబ్లిస్క్ టవర్



టవర్ ఎదురుగా అసంపూర్తిగా వాటర్ ఫౌంటెన్ నిర్మాణం

సేవలు అభినందనీయం

అమలాపురం రూరల్: మహిళా సంఘాల సభ్యులకు రుణాలు ఇవ్వడంలో సమనస ఎస్‌బీఐ ప్రథమ స్థానంలో ఉందని, ఆ బ్యాంక్ సేవలు అభినందనీయని డీఆర్‌డీఏ పీడీ శివశంకర్‌ప్రసాద్ అన్నారు. సమనస ఎస్‌బీఐ ఆధ్వర్యంలో వన్నెచింతలపూడి గ్రామంలో శుక్రవారం రాత్రి జరిగిన శిబిర్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మహిళల స్వయం ఉపాధి కోసం బ్యాంకు ద్వారా రూ.10 కోట్లు రుణాల చెక్కును బ్యాంక్ రీజనల్ మేనేజర్ గుణేశ్వరరావు, సర్పంచ్ నక్కా రాజారత్నం నాగవాణి, ఎంపీటీసీ సభ్యులు పరమట నాగమణి, బ్రాంచ్ మేనేజర్ సుధీర్‌కుమార్ అందించారు. ఎస్‌బీఐ ఆర్‌బీవో చీఫ్ మేనేజర్ పి.నవీన్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు రూ.10 కోట్ల చెక్కును అందిస్తున్న పీడీ శివశంకర్‌ప్రసాద్, ఆర్ఎం గుణేశ్వరరావు

నాయకులపై కేసు నమోదు

ఉప్పలగుప్తం: ఎమ్మెల్సీ ఎన్నికల్లో కుడుపూడి సూర్యనారాయణకు అవకాశం కల్పిస్తారన్న ఊహాగానాల నేపథ్యంలో ఉప్పలగుప్తం మండల దళిత నేతలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రధాన రహదారిపై శుక్రవారం నిరసనకు దిగారు. కుంచే బాబుల ఆధ్వర్యంలో ఎలాంటి అనుమతులు లేకుండా ప్రధాన రహదారిపై రాస్తారోకో చేయడంపై స్థానిక వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు ఉప్పలగుప్తం ఎస్సై జి.వెంకటేశ్వరరావు కేసు నమోదు చేశారు.

తాగునీరు అందించేందుకు కార్యాచరణ

ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు

మామిడికుదురు: వేసవిలో తాగునీటి సమస్య ఏర్పడకుండా ఇప్పటి నుంచే కార్యాచరణ చేపట్టాలని ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ కుసుమ వనజకుమారి అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న చిట్టిబాబు మాట్లాడుతూ శివారు ప్రాంతాలకు తాగునీరు అందించే దిశగా ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలన్నారు. దీంతో పాటు దాళ్వా పంటకు సాగునీటి సమస్య ఏర్పడకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చిట్టిబాబు సూచించారు. కాలువ శివారు భూములకు సైతం సాగునీరు అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. వైరస్ బారిన పడి చనిపోతున్న పందుల మృత కళేబరాలను పంట కాలువలు, గోదావరి నది, డ్రైన్లలో విచ్చలవిడిగా పడేయడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారంటూ సర్పంచ్‌లు అడబాల తాతకాపు, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, గుబ్బల గీతాభవాని, చెల్లుబోయిన రామశివ సుబ్రహ్మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. మృత కళేబరాలను పూడ్చి పెట్టే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. సార్వాలో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసేందుకు సమస్యలు సృష్టించారని పీఏసీఎస్ చైర్మన్లు కటకంశెట్టి ఆదిత్యకుమార్, బొలిశెట్టి భగవాన్ వాపోయారు. దాళ్వాలో ఈ పరిస్థితి రాకుండా ముందుగానే దిగుబడిని అంచనా వేసి దానికి అనుగుణంగా ధాన్యం కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పాశర్లపూడిలంక–లూటుకుర్రు గ్రామాల మధ్యలో వాడ్రేవుపల్లి మీడియం డ్రైన్‌పై శిథిలమైన కాజ్‌వే కూలిపోయే ప్రమాదం ఉందని సర్పంచ్‌లు వాపోయారు. దీనికి తాత్కాలిక మరమ్మతులైనా చేపట్టాలన్నారు. పెదపట్నంలంక ఆర్ అండ్ బీ రోడ్డును ఆధునీకరించాలని ఎంపీటీసీ కొమ్ముల జంగమయ్య డిమాండ్ చేశారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన ఎంఈఓ ఎం.ప్రసాదరాజుకు సమావేశం సంతాపం తెలిపింది. జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, ఎంపీడీఓ కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు